## లక్ష్మీపతిని చూడాలంటే గోతులు దాటాల్సిందే

**నందిగామ, జూలై 25 ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రం శివారులో ఉన్న మహిమాన్విత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం కు వెళ్లే రహదారి వర్షపు నీటితో గోతుల మయమయింది. నిత్యం దేవాలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. స్వకార్యం కార్యరూపం దాల్చాలని.. మొక్కుకునే నాయ కులు రహదారిని బాగు చేయడంలో విఫల మయ్యారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఆలయ ప్రాముఖ్యతను దృష్టి లో ఉంచుకొని అధికారులు స్పందించి రహదారిని పునరుద్ధరించాలని ఈప్రాం త భక్తులు



గోతుల మాయమైన నరసింహస్వామి దేవాలయ మార్గం

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## విద్యార్థులతో కలిసి భోజనం చేసి హాస్టల్‌లో తనిఖీలు

**శామీర్‌పేట, జూలై 25, ప్రభాతవార్త :** తుర్కపల్లిలోని మహాత్మాజ్యోతిబాపూలే బిసి సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆ హాస్టల్‌లో వంటకాలను, ఆహారపధార్థాల నాణ్యతను మేడ్చల్ జిల్లా ఫౌరసరఫరాల మేనేజర్ ఎల్.సుగుణబాయి సందర్శించి తనిఖీలు చేశారు. విద్యార్థులకు ఇస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. వంటశాలలో పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన పోషకారమైన భోజనం అందుతున్నా యోలేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు బలవర్ధకం నాణ్యమైన ఆహారాన్ని అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొ న్నారు. హాస్టళ్లలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని ఆదేశించారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జిల్లా మేనేజర్ సుగుణబాయి

# యూరియా ఏదయా!

**బంట్వారంలో రైతుల ఆందోళన**

**ఒకటి రెండు బస్తాలే ఇస్తున్నారని ఆగ్రహం**

**వర్షాల తరుణంలో మొక్కజొన్న, పత్తి పైర్లకు అవసరమని వెల్లడి**

**సొసైటీ అధికారులు దళారులకు అమ్ముకుంటున్నారని ఆరోపణ**



సొసైటీ ముందు ఆందోళన చేస్తున్న రైతులు

**కోట్‌పల్లి, జూలై 25, ప్రభాతవార్త:** అన్నదాతలకు యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. బంట్వారం మండల కేంద్రంలో అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటిలో యూరియా కొరత ఉండటంతో రైతులు అందోళన చేశారు. సొసైటిలో యూరియా అందుబాటులో లేక రైతులకు తిప్పలు తప్పడం లేదు. వర్షాలు కురవడంతో పంటలకు అవసరమయ్యే యూరియా వేద్దామని అనుకుంటే ఒక రైతుకు ఒకటి రెండు బస్తాల యూరియా మాత్రమే ఇస్తున్నారని రైతులు అందోళన వ్యక్తం చేశారు. కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, పత్తికి, యూరియా తప్పని సరి అని..అధికారులందరు కలిసి దళారులకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వెంటనే రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని మండల రైతులు డిమాండ్‌చేశారు. అయితే అధికారులు మాత్రం రెండు రోజుల్లో సరిపడా యూరియాను అందుబాటులో ఉంచుతామని రైతులకు హామీ ఇచ్చారు.

## కృత్రిమ కొరతను సృష్టిస్తే లైసెన్స్‌లు రద్దుచేస్తాం

**జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాజరత్నం హెచ్చరిక**

**పూడూరు, జూలై 25, ప్రభాతవార్త :** జిల్లాలో యూరియా దొరకడంలేదని ఎరువుల డీలర్లు కృత్రిమ కొరతను సృష్టిస్తే లైసెన్స్‌లు రద్దుచేస్తామని వికారాబాద్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాజరత్నం హెచ్చరించారు.రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయసాగు సూచనలపై శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు పూడూరు మండల కేంద్రంలోని రైతువేదికలో పాల్గొనిన డిఓ ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3.78లక్షల ఎకరాల్లో రైతులు పంటసాగు చేస్తున్నారని,ఇందులో 2.31వెల ఎకరాల్లో



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఓ రాజరత్నం

పత్తి,లక్షా ఎకరాల్లో కంది,26వేల ఎకరాల్లో మొక్కజొన్న,10వేల ఎకరాల్లో పెసర పంటలు సాగుచేశారని,లక్షా 20వేల ఎకరాల్లో వరినాట్లు వేసే ందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం రైతులకు వర్షాలు ఆశాజనకంగా ఉన్నాయని, పంట పొలాల్లో నిలిచిన నీటిని కాలు వలద్వారా తొలగించాలన్నారు. మిగతా 2లో

# భూ భారతి మెడమీద కత్తి



కోట్‌పల్లిలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహశీల్దార్ శ్రీనివాస్ (ఫైల్)

**ఆగస్టు 14 నాటికి దరఖాస్తులు క్లియర్ చేయాలని ప్రభుత్వం ఒత్తిడి**

**ముంచుకొస్తున్న గడువుతో తహశీల్దార్లకు ముచ్చెమటలు**

**రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి 354 అర్జీలు**

**పరిష్కరించినవి 60 మాత్రమే..**

**అధికారులకు గుదిబండలా మారిన పెండింగ్ దరఖాస్తులు**

**నిత్యం కాన్ఫరెన్స్‌లు, ముఖాముఖి సమావేశాలతో పని ఒత్తిడి**

**ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ఫైళ్లతో కుస్తీ**

**కొలిక్కిరాని భూ సమస్యలు**

**క్షేత్ర స్థాయి సర్వేకు అడ్డంకిగా మారిన వాతావరణం**

**పరిష్కారం కోసం భూ భారతిపై రైతుల కోటి ఆశలు**

**కోట్‌పల్లి/ధారూర్, జూలై 25, ప్రభాతవార్త :** భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం రెవెన్యూ అధికారులకు మెడపై కత్తిలా మారింది. ఆగస్టు 14 నాటికి రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. గడువు ముంచుకొస్తుండటంతో అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలన చేసి క్లియర్ చేయాల్సిన, రికార్డుల్లో భూమి ఎక్కువగా ఉండి అనుభవంలో తక్కువగా ఉండటం లాంటి క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం లభించక వారు తల పట్టుకుంటున్నారు. కోట్‌పల్లి మండల వ్యాప్తంగా జూన్ 3నుంచి జూన్ 20 వరకు గ్రామాలల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. మొత్తం 354 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఆసైన్‌మెంట్ భూముల క్రయ, విక్రయాలు, రికార్డుల అప్‌డేషన్, సాదాబైనామా కోసం దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటికి దాదాపు 60 పైగా మాత్రమే రైతులకు నోటీసులు జారీ చేసి పరిష్కరించారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు తహసీల్దార్లు, ఆర్ఐలు, ఆపరేటర్లు ఫైళ్లతో కుస్తీ పట్టినప్పటికీ సమస్యలు ఓ కొలిక్కి రావడం లేదని మండలస్థాయి అధికారులు వాపోతున్నారు. ఓ వైపు పని ఒత్తిడి మరోవైపు రోజు రాత్రి సమయాల్లో కాన్ఫరెన్స్‌లు, ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తుండడంతో సమయం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో మొదటగా పైలట్ ప్రాజెక్టు కింద మిగతా 2లో

## ఎందుకీ జాప్యం?

**భూ భారతిపై ఆర్‌డిఓను ప్రశ్నించిన అదనపు కలెక్టర్**

**కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ**

**రికార్డులు పరిశీలన**



ఫైళ్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 25, ప్రభాతవార్త :** కీసర రెవెన్యూ డివిజన్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయాన్ని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీఓ ఉపేందర్ రెడ్డిని ఆదేశించారు. భూభారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సుల్లో ధరఖాస్తు దారులు ఇచ్చిన దరఖాస్తులు ఎన్ని పరిష్కారం అయినవని ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి జరుగుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతికపరమైన ఇబ్బందులు ఉన్నట్లు అయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. దీనిలో ఆర్డీఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధరణిలో ఉన్న చిక్కులను తీర్చేందుకే భూభారతి



మాట్లాడుతున్న భూమి సునీల్, తహశీల్దారు భరత్‌కుమార్‌గౌడ్ తదితరులు

**పూడూరు, జూలై 25, ప్రభాతవార్త :** ధరణిలో ఉన్న చిక్కులను తీర్చేందుకే భూభారతి చట్టాన్ని తేవడం జరిగిందని భూభారతి రూపకర్త భూమిసునీల్ పేర్కొన్నారు. సాగున్యాయ యాత్రలో భాగంగా శుక్రవారం పూడూరు మండలకేంద్రంలోని రైతువేదికలో రైతులకు భూచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారంకోసం 124 చట్టాలు, దేశంలో 5వేల చట్టాలు ఉన్నాయని వివరించారు. వీటిపై అవగాహనలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రంలోని వెయ్యి గ్రామాలకు లీఫ్స్ సంస్థ అద్వర్యంలో అవగాహన కల్పించేందుకు ముందుకు వచ్చినట్లు వివరించారు. రైతుకు భూమి ఉండి పట్టాదారు పాసుపుస్తకం లేనిచో భూభారతి చట్టం సెక్షన్4(6), రూల్4 ప్రకారం భూభారతి పోర్టల్ లేదా మీసేవాద్వారా దరఖాస్తు చేసుకొని పట్టా పొందవచ్చన్నారు .రైతుకు పట్టాదారు పాసుపుస్తకం లేకపోయినా, పాసుపుస్తకం ఉండివివరాలు తప్పుగా నమోదు అయినా ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో దరఖాస్తునునింపి రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని, లేనిచో భూభారతి పోర్టల్, మీసేవాలో దరఖాస్తు చేయాలని సూచించారు. వచ్చే రోజుల్లో రాష్ట్రంలో ఆధార్‌కార్డు మాదిరిగా భూధార్ వస్తుందని వివరించారు. విత్తనాలు కొన్నప్పుడు రసీదు తప్పక మిగతా 2లో

## విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థ కీలకం

**ఎస్పీ నారాయణ రెడ్డి**



**పరిగి జులై 25 ప్రభాతవార్త :** పరిగి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి, ఐపీఎస్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా..ఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రికార్డులను తనిఖీ చేసి,వివరాలను అడిగి తెలుసుకున్నారు... ఈ సందర్భంగా ఎస్పీ కె. నారాయణ రెడ్డి మాట్లాడుతూ... పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణతో, నిబద్ధతతో తమ విధులను నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు, పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేందుకు విలేజ్ పోలీస్ ఆఫీసర్ (విపివి) వ్యవస్థ చాలా కీలకమని ఆయన ఉద్ఘాటించారు.. వి.పి.ఓ లుగా ఉన్న పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామం యొక్క అన్ని వివరాలను తెలుసుకుని, ప్రజలతో స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించుకోవాలని ఆదేశించారు.

గామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో వి.పిఓల పాత్ర అత్యంత కీలకమని, గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎస్పీ తెలిపారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న సంఘటనలపై నిఘా ఉంచాలని సూచించారు. యువతను తప్పుదోవ పట్టించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళలు, పిల్లల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారిపై జరిగే నేరాలను అరికట్టడంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని స్పష్టం చేశారు.దొంగతనాల కేసుల పట్ల ప్రత్యేక చొరవ చూపి, వాటిని త్వరగా ఛేదించడానికి కృషి చేయాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న గంజాయి రవాణా, అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టి, నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలలో సీసీటీవీ ఆవశ్యకతపై అవగాహన పెంచి, నిఘా వ్యవస్థను బలోపేతం చేయడానికి సీసీటీవీలను ఏర్పాటు చేయించాలని సూచించారు.

ప్రజల ఫిర్యాదులను స్వీకరించ డంలో నూ, వాటిపై తక్షణమే స్పందించడంలోనూ పోలీసులు చురుకుగా ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని నేరాలను ఛేదించడంలో మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజల సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని ఎస్పీ కె. నారాయణ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో పరిగి, సబ్ డివిజన్, డి.ఎస్.పి శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి , పరిగి ఎస్.హెచ్.ఓ. మోహన్ కృష్ణ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు జిప్లస్ 3 పక్కా ఇళ్లు

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా**



పేదల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాధికగుప్తా

**శామీర్‌పేట, జూలై 25, ప్రభాతవార్త :** పేదలు చాలీ చాలని ఇళ్లలో ఉంటున్న పేదలకు జిప్లస్ 3 పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, మీరంతా అంగీకారం తెలిపితే వెంటనే కార్యచరణ ఆరంభం అవుతుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా స్పష్టం చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ శివశివాని కాలనీ, అంతాయిపల్లిలోని బిట్స్ పేదల కాలనీల్లో, ఆ తరువాత ఆమె మేడిపల్లి మండలం ఫీర్జాదిగూడ మున్సిపల్ భగత్‌సింగ్‌నగర్ కాలనీల్లోనూ పర్యటించి ఆయా ప్రాంతాల పేద ప్రజలతో మాట్లాడి ఇళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా మాట్లాడుతూ పేదలు చిన్న చిన్న స్థలాల్లో నివాసాలు ఉంటూ చాలీచాలని ఆవాసాలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం జిప్లస్ 3పక్కా ఇళ్లు నిర్మించటానికి సిద్ధంగా ఉందని, మీరు ఒప్పుకుంటే ఇళ్లు మంజూరు ఇవ్వటం జరుగుతుందన్నారు. జిప్లస్ 3 పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వటానికి పేదలను ఒప్పించటానికి మిగతా 2లో

## అంగన్‌వాడీ భవనంలో మురుగుకు అడ్డుగోడ

**వార్త కథనానికి స్పందన**

**పూడూరు, జూలై 25, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామానికి చెందిన నెం.1 అంగన్‌వాడీ కేంద్రం సమస్యలపై అధికారులు దృష్టి పెట్టారు. కాలుపెట్టాలంటే సాహసమే అన్న శీర్శికన వార్త పత్రికలో ప్రచురితం అయిన కథనానికి వారు స్పందించారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రంలోకి మురుగునీరు రాకుండా పంచాయతీ అధికారులు చిన్నపాటి గోడను కట్టించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. అంగన్‌వాడీలో ఉన్న మిగిలిన సమస్యలనూ పరిష్కరించాలని కోరారు. తరుచుగా వస్తున్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని విజ్ఞప్తి చేశారు.

## బురదలోనే సంత

**-షెడ్లు, ప్లాట్‌ఫామ్‌లు లేక అవస్థలు**

**దౌల్తాబాద్, జూలై 25 ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంత సమస్యలకు నిలయంగా మారింది. మండలకేంద్రంలో జరిగే సంతలో స్థానికంగా ఉండే ప్రజలు,చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూరగాయలు కొనుగోలు చేస్తారు.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారంరోజు వారసంత మొత్తం బురదమయంగా మారింది.ఈ వర్షానికి చిరు వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సెండ్లు గాని, ప్లాట్‌ఫామ్‌లు గాని లేకపోవడంతో వర్షంలో తడుస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగిందని అన్నారు. ఎండాకాలంలో మండుటెండల్లో, వర్షాకాలంలో వర్షంలో తడుస్తూ కొనుగోలు చేస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సౌకర్యాలు కూడా తమకు ఎవరు కల్పించడం లేదని,వర్షం వస్తే వర్షంలో తడుస్తూ కూరగాయలు కొనుక్కుంటున్నామని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని అధికారుల దృష్టికి,సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఇట్టి సమస్యను తీసుకెళ్లి,వారానికి ఒకసారి నిర్వహించే సంతలో షెడ్లు,ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## వర్షం తెరిపివ్వడంతో తేరుకున్న జనం

**రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రజాప్రతినిధులు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లాలో వాన ముసురు తగ్గినట్లే కనిపించినా శుక్రవారం సాయంత్రం మళ్లీ విస్తారంగా వర్షాలు కురిశాయి. ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించింది. అయితే, శుక్రవారం సాయంత్రం వరకు వర్షానికి తాత్కాలిక బ్రేక్ పడటంతో జనం తమ పనుల్లో నిమగ్నమైనారు.



మహంతిపూర్ వద్ద నిర్మిస్తున్న వంతెన

మహంతిపూర్ వద్ద తాత్కాలికంగా బాట వేస్తున్న దృశ్యం

వర్షాలకు పలు ప్రాంతాలలో స్తంభించిన రాకపోకలను పునరుద్ధరించారు. తాండూరులో చిలుకవాగుపై నిర్మించిన వంతెను ఉపయోగంలోకి తెచ్చారు. కొత్త బ్రిడ్జీపై నుంచి వాహనాలను మళ్లించారు. రెండు రోజులుగా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ నెలకొంది. ఉదయం ఎమ్మెల్యే బీ.మనోహర్‌రెడ్డి కొత్త బ్రిడ్జిని సందర్శించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చిలుకవాగు ఎఫెక్టెడ్ కాలనీలను కూడా సందర్శించారు. వరదనీరు వెళ్లేందుకు జేసీబీలను ఉపయోగించడంతో మార్కాండేయ కాలనీ, గ్రీన్‌సిటీ, ఆదర్శనగర్ కాలనీల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ సెగ్మెంట్‌లోని బొంరాస్‌పేట మండలం మహంతిపూర్ వద్ద వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారు. అక్కడ సీమవాగు ప్రవాహం పెరగడం వల్ల రెండు రోజుల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. బొంరాస్‌పేట మండలం జాన్కంపల్లి నుంచి మహంతిపూర్ వరకు రూ.23 కోట్ల సీఆర్‌ఆర్ గ్రాంట్‌తో రోడ్డు, రెండు వంతెనలు నిర్మిస్తున్నారు. శుక్రవారం సీమ వాగులో కొత్త బ్రిడ్జీ కింద పైపులు వేసి యంత్రాల సహాయంతో తాత్కాలిక రోడ్డు వేశారు. దానివల్ల నడకకు సౌకర్యంగా మార్చారు. బైక్‌లను కూడా అతికష్టమ్మీద నడిపించారు. ఇలా ఉండగా ప్రాజెక్టులలోకి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. కోటపల్లి, జుంటుపల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, నందివాగు ప్రాజెక్టులకు కొత్త నీరు వచ్చింది. మరిన్ని భారీ వర్షాలు కురిస్తే ప్రాజెక్టులలోకి పూర్తిస్థాయి నీరు చేరుతుంది.

**ఎడతెరిపి లేని వానతో చిత్తడిగా రోడ్లు**

**ఘట్‌కేసర్, జూలై 25, ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపిలేని వానతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఘట్‌కేసర్‌లో 5.6 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. వర్షంతో లోతట్టుప్రాంతాలు, కాలనీలు మిగతా 2లో

## మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాల్సిందే

**మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు పురుషోత్తంరావు డిమాండ్**

**శామీర్‌పేట, జూలై 25, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మున్నూరుకాపుల కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావు స్పష్టం చేశారు. శుక్రవారం నగరం నుంచి శామీర్‌పేట మీదుగా ఛలో వేములవాడ కార్యక్రమానికి రాజీవ్‌రహదారిన ర్యాలీగ వెళుతూ శామీర్‌పేట పెద్ద చెరువుకట్ట మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. శామీర్‌పేట మండల మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చాట్లపల్లి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా స్వాగతం పలికి గజమాలతో పలువురు నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు పుట్టం పురుషోత్తంరావు మాట్లాడుతూ మున్నూరుకాపుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు, ప్రభుత్వం వెంటనే మున్నూరుకాపుల కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలోని మున్నూరుకాపులందరిని ఏకం చేస్తూ సంఘటితం చేయటానికి కార్యచరణ చేపట్టటం జరిగిందన్నారు. మున్నూరుకాపుల ఆత్మగౌరవ బాహుట ఎగురవేయటానికి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు, మున్నూరుకాపుల సంఘటితం, ఐక్యతతకు అన్ని జిల్లాల నాయకులతో ర్యాలీ నిర్వహిస్తూ వేములవాడను చేరుకుంటుందన్నారు. వేములవాడ రాజరాజేశ్వరి ఆలయంలో పూజలు చేసి ఆ తరువాత బద్ది పోచమ్మకు బోనం సమర్పిస్తామన్నారు. ప్రభుత్వంతో సఖ్యతతోనే ఉంటూ మా సమస్యలను పరిష్కరించుకుంటామని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ఛలో వేములవాడకు అపూర్వ స్పందన మున్నూరుకాపుల నుంచి లభిస్తుందని, పాల్గొంటున్న నాయకులందరికి దన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు బండి పద్మ, మున్నూరుకాపు యువనాయకులు ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్ది పెంటన్నది తదితరులు పాల్గొన్నారు.



కట్టమైసమ్మ ఆలయం వద్ద పురుషోత్తంరావుకు స్వాగతం పలుకుతున్న కాపు నాయకులు

## పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లు



**దుద్యాల్, జూలై 25, ప్రభాతవార్త:** పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లు కాంగ్రెస్ ద్వారానే సాధ్యం అని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మార్వో కిషన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ లతో కలిసి మండల కేంద్రానికి సంబంధించిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల ు అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు నిరుపేదలకు వరం లాంటివన్నారు. అర్హులైన నిరుపేదల ు ప్రభుత్వం గుర్తించి వారికి విడతలవారీగా గూడు కల్పించే విధంగా అన్ని ఏర్పాట్ల ు చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే మాట నిలబెట్టుకుంటుందని అన్నారు. మండల కేంద్రానికి 71 ఇండ్లు కేటాయించగా 53 ఇళ్లకు ప్రొసీడింగ్స్ వచ్చినట్లు తెలిపారు. 9 మంది లబ్ధిదారుల ఇండ్లకు ముగ్గు వేసి, భూమి పూజ చేసి ప నులు ప్రారంభించారు. ఉపతహసిల్దార్‌వీరేష్ బాబు, ఎంపీవో సత్యనారాయణ, పిఏసిఎస్ డైరెక్టర్ ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ, గ్రామఅధ్యక్షుడుశ్రీశైలంగౌడ్, మైనార్టీ సెల్ మండల ప్రెసిడెంట్‌హాజీ, నాయకులుఖాజ, సంజీవ్‌కుమార్, సత్యనారాయణ ,శకనప్ప, ముజీబ్, పాకాల అనిల్, అంజిలయ్య పాల్గొన్నారు

## ఫ్లైఓవర్ నిర్మాణానికి స్థల పరిశీలన



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై25:** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వై జంక్షన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ ప్రాజెక్టును రూ.184 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు స్థానిక నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు నిర్మాణానికి అవసరమైన కొలతలు సూచించడంతో పాటు, రైల్వేశాఖ నుండి 24 మీటర్ల అనుమతి త్వరలో వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. స్థల పరిశీలనలో ఆర్అండ్‌బీ ఏఈ రవీందర్, కాంట్రాక్టర్ సందీప్ కుమార్, టి.వి.రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, నాయకులు అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, రవికుమార్, నీరటి వాసు, చందులాల్, శేఖరప్ప, శంకర్, సందీప్ రెడ్డి, ఖదీర్, ముబారక్ అలీఖాన్, శేఖర్, రవితేజ, రమేష్, రాజుల యాదయ్య, మన్నెరవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తగ్గిస్తూ, భవిష్యత్తు పట్టణాభివృద్ధికి తోడ్పడేలా ఈ ఫ్లైఓవర్ బ్రిడ్జి కీలకంగా మారనుందని నాయకులు పేర్కొన్నారు.

## 40 స్కూళ్లకు ఏటా రూ.2 లక్షలు ఇస్తాం

**నందిగామ జూలై 25 ప్రభాతవార్త** తన తల్లి స్మారకార్థం ఆమె పేరు మీద నియోజకవర్గం లోని 40 పాఠశాలకు ప్రతి ఏటా పంద్రాగస్టు రోజున రూ.5000 వేలు అందజేయనున్నట్లు షాద్నగర్ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి ప్రకటించారు. నందిగామ మండల కేంద్రంలో ఉన్న ప్రిన్స్ ప్యాలెస్ లో తన మాతృమూర్తి కీర్తిశేషులు తిరుమలమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాబోధనలో భాగంగా అందిస్తున్నఈనగదుపురస్కారం బ్రతికి ఉన్నంతకాలం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహిస్తూ సమాజ సేవలో ముందుకు సాగుతున్న వంకాయల నారాయణరెడ్డి కుటుంబ సభ్యులను పలువురు రాజకీయ ప్రముఖుల అభినందించారు.

## ప్రభుత్వ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి..

**షాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** కూరగాయల తోటలు సాగు చేస్తున్న రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారిణి కీర్తికృష్ణ అన్నారు. టమాటో, వంకాయ, పచ్చిమిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ పంట వేయాలనుకునే వారు కనీసం 40 నుండి 50 రోజుల ముందే ధరకాస్తు చేసుకుంటే, సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ జీడిమెట్ల నుండి నారు ఉచితంగా పొందవచ్చన్నారు. వంకాయలో అంటు ( గ్రాఫ్ట్) మొక్కలు కూడా రాయితీపై లభిస్తాయని, ఎకరానికి 2000 నారు మొక్కలు మల్చింగ్ షీట్ వేసుకొని, ట్రెల్లిస్ పై వేకోవాలని, అందుకు నికై రైతు ఎకరానికి 5000 రూపాయలు డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేయడానికి రైతు పట్టా పాసుబుక్, బ్యాంకు పాసుబుక్, ఆధార్ కార్డుల జీరాక్స్ లు, ఒక పాస్పోర్ట్ సైజు ఫోటో జత చేసి మీ సంబంధిత ఉద్యాన అధికారి కార్యాలయం వద్ద అందజేయాలని కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం: ఏఇ

**ఘట్‌కేసర్, జూలై 25, ప్రభాతవార్త:** వర్షాకాలం దృష్ట్యా చెట్ల కొమ్మలు తొలగింపు, డీసీ పనులు, కొత్త సేవలు విడుదల చేస్తున్న కారణంగా శనివారం కరెంట్ సరఫరాకు అంతరాయం కల్గుతుందని ఉండదని ఏఈ బి.యశ్వంత్‌కుమార్ తెలిపారు. 11 కెవి కొండాపూర్ ఫీడర్ పరిధిలో కొండాపూర్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంటల వరకు, 11 కెవి డానో ఫీడర్ పరిధిలోని కెఎల్‌ఆర్‌నగర్, ఘణాపూర్, యంనంపేట్ పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11 కెవి యంనంపేట్ ఫీడర్‌లోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బాలాజీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్‌లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు, 11 కెవి ఘట్‌కేసర్ ఫీడర్‌లోని ఘట్‌కేసర్ పట్టణంలో ఉదయం 11 గంటల నుంచి 11:30 గంటల వరకు, 11 కెవి హెపిసిఎల్ ఫీడర్‌లోని హెచ్‌పిసిఎల్‌లో ఉదయం 10:30 గంటల నుంచి 11 గంటల వరకు, 11 ఎన్ఎఫ్‌సీనగర్ ఫీడర్ పరిధిలోని ఎన్ఎఫ్‌సీనగర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఏఈ కోరారు.

## కెవీఎం హాస్టల్లో బాలిక ఆత్మహత్యాయత్నం

**కుల్కచర్ల, జూలై 25, ప్రభాతవార్త** ః కుల్కచర్ల మండల కేంద్రంలోని కె వి ఎం పాఠశాలకు చెందిన హాస్టల్లో ఆరవ తరగతి చదువుతున్న బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శుక్రవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రముఖ కేవీఎం పాఠశాల హాస్టల్‌లో వికారాబాద్ జిల్లా చెంచుపల్లికి చెందిన ఆరవ తరగతి చదువుతున్న బాలిక రాజ్యలక్ష్మి పే ను మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం గమనించిన పాఠశాల సిబ్బంది కుల్కచర్ల పిహెచ్సికి తరలించగా వైద్యుల సూచన మేరకు పరిగి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వైద్య చికిత్స చేసి ప్రాణాపాయం లేదని నిర్ధారించారు. హాస్టల్లో ఉండడం ఇష్టం లేక ఈ ఘటనకు పాల్పడింది. హాస్టల్లో ఉండడం తనకి ఇష్టం లేదని బాలిక ఉపాధ్యాయులకు సూచించగా వారు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు రెండు రోజుల తర్వాత వచ్చి తీసుకెళ్తామని చెప్పడం జరిగిందని, ఈలోపే బాలిక ఇలా చేసిందని పాఠశాల సిబ్బంది తెలిపారు. వైద్య చికిత్స అనంతరం బాలిక ను తల్లిదండ్రులకు అప్పగించారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ అభివృద్ధి భక్తాగ్రేసులదే



### షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై 25 :** జానంపేట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఆలయ అభివృద్ధి భక్తాగ్రేసులదేనని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని జానంపేట వెంకటేశ్వర స్వామి పురాతన చరిత్ర గల ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరిగి పాతికేళ్లు గడిచిన సందర్భంగా ఆలయ సంప్రోక్షణ, ఆలయంలో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. దాదాపు 25 రోజుల పాటు జరిగే ఈ మరమ్మతుల అనంతరం పవిత్రోత్సవాలు, మహ కుంభాభిషేకం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పురాణాల ప్రకారం బహమనీ సుల్తానుల చరిత్ర ప్రకారం పెద్ద జానమ్మపేటలో వెంకటేశ్వర ఆలయాన్ని 1692లో అప్పటి వనపర్తి సంస్థానాధీశులు సవాయి వెంకట్ రెడ్డి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు మాజీ ఎమ్మెల్యే బక్కని తెలిపారు. వనపర్తి రాజు బహిర్ గోపాల రావు శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులు కావడంతో ఈ ప్రాంతంలో షాద్‌నగర్ నుండి అల్వాల సికింద్రాబాద్ వరకు ఎన్నో వేంకటేశ్వర స్వామి దేవాలయాలను ఆనాడు నిర్మించినట్లు గుర్తు చేశారు. 1724 తర్వాత ఆలయ బాగోగులు కరువై శిథిలావస్థకు చేరుకుందని, 1994లో తాను ఎమ్మెల్యేగా గెలిచాక తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా ఉన్న సమయంలో టీటీడీ ప్రధాన పూజారి మాడంబాకం శ్రీనివాస భట్టాచార్యులు ఆగమశాస్త్ర ప్రకారం వెంకటేశ్వర స్వామి దేవాలయానికి మరమ్మతులు చేయించి పాతికేళ్ల క్రితం తిరుపతి నుండి మూల విరాట్ శిలా విగ్రహాన్ని తెప్పించి పున: ప్రతిష్ట చేసినట్లు బక్కని తెలిపారు.

ఎంతో చరిత్రాత్మకమైన ఈ ఆలయాన్ని కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి విదేశాల నుండి భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు. గర్భాలయంలో సంప్రోక్షణ కార్యక్రమాలను శుక్రవారం వేద పండితులు ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గర్భాలయంలోమరమ్మతు పనులను మాజీ ఎమ్మెల్యేబక్కని నర్సింహులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీఐ విజయ్‌కుమార్, ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్, సాయీశ్వర్ రెడ్డి, కిషన్, ప్రముఖ పాత్రికేయుడు లట్టుపల్లి మోహన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కేపీ, రాఘవేందర్ గౌడ్, రాకేష్, క్రిష్, ఎస్పీ బాలు, జగన్, ఆలయ నిర్వాహకులు భూపాల్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



**షాబాద్, జూలై 25, ప్రభాతవార్త:** విద్యుత్‌షాక్ తలిగి పాడి ఆవు మృతి చెందిన సంఘటన షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మ గూడగ్రామంలోగురువారంసాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వల్లూరి అశోక్ తన పొలం పక్కన పాడి ఆవును మేత మేపుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ నుండి విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.80,000 విలువచేసే పాడి ఆవు తన కుటుంబానికి జీవనాధారం అని అన్నారు. తనకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతు కోరారు.

## రంగనాయకస్వామి జాతరకోసం ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ఘట్‌కేసర్, జూలై 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేతరంగమన్నార్‌నాయకస్వామిజాతరకు విచ్చేయాలని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, స్థానిక నాయకులు బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బ్రహ్మోత్సవాల రథోత్సవ ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఈసందర్భంగా ధర్మకర్తలు ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులనఉ పూలదండతో సన్మానించి ఆశీర్వచనం అందించారు. రంగనాయకస్వామి జాతరకు ప్రతియేటా రావడం జరుగుతుందని ఈసారి కూడా స్వామి కళ్యాణం, రథోత్సవానికి తప్పకుండావస్తామని మల్లారెడ్డి వారికి తెలియజేశారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం డైరక్టర్లు చందుపట్ల ధర్మారెడ్డి, గ్యార వెంకటేశ్, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నాగులపల్లి రమేశ్, ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, ఆర్‌బిఎస్ జిల్లా మాజీ సభ్యులు చిలుగూరి మంకయ్య, మాజీ ఎంపిటిసి మంకం రవి, నాయకులు అల్లం శంకర్, నాగేశ్, యాదిరెడ్డి, బుచ్చిరెడ్డి, సందీప్‌రెడ్డి, కె.రాజశేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు

## ఉచిత వైద్య శిబిరం



**షాబాద్, జూలై25, ప్రభాతవార్త:**

గ్రామీణులు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్ యూనివర్సిటీ అధికారి బండి కీర్తి అన్నారు. షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో శుక్రవారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హైదరాబాద్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు కాలేయ వ్యాధి పై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనిషి శరీరంలో కీలకమైన అవయవం కాలేయమని అన్నారు. కాలేయాని కాపాడుకుంటూ, మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. రోగాలు అశ్రద్ధ చేయవద్దని, వైద్యుల సలహాలు సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రచన డోముడాల, శ్రీదేవి ప్రసన్న, సిబ్బంది గురువయ్య, మానస, గ్రామస్తులు పామెన నర్సింలు, గ్రామస్తులు ఉన్నారు.

## మొక్కలు నాటిన విద్యార్థులు



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై25:** విద్యార్థుల మేధస్సులాగే మొక్కలు కూడా ఉషస్సులు పంచాలని, పర్యావరణ పరిరక్షణ ఆవిష్కరించాలని షాద్‌నగర్ వివేకానంద బాలికల ఉన్నత పాఠశాలడైరెక్టర్‌రవిప్రకాష్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలోవిద్యార్థులచేత హరితం "రంలోభాగంగా మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పచ్చని చెట్లతో కూడిన ఆహ్లాదకరమైన వాతావణం ఉంటే విద్యార్థులు చక్కగా చదువుకొని భవితవ్యం వైపు నడుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీతాలక్ష్మీ, ఉపాధ్యాయులు అనూష, సత్యాంజలి, షాహీన, మహేశ్వరి పాల్గొన్నారు.

## స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ ను సందర్శించిన ఎస్సీఎఫ్ పరిశీలకులు..



**దుద్యాల్, జూలై 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రెండు రోజులపాటు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సముదాయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జయరామారావు తెలిపారు. శుక్రవారం నాడు నిర్వహించిన సమావేశాన్ని స్టేట్ కరికులం ఫ్రేమ్ వర్క్ పరిశీలకులు దీపక్, జాయ్ లు సందర్శించారు. ఎమ్మార్పీలు వెంకటయ్య, శంకరప్ప లతో వివిధ అంశాల గురించి చర్చించారు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ కి సంబంధించిన వివిధ అంశాల పట్ల ఎమ్మార్పీలు ఉపాధ్యాయులకు ఫీడ్ బ్యాక్ అందించారు.

## బాగీర్దారీ న్యాయ్ సమ్మేళన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూలై25 :** ఢిల్లీలోనితల్కటోరా స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ ఓబీసీ సెల్ నిర్వహించిన భాగీదారి న్యాయ్ సమ్మేళన్‌లో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలన్నింటిలో కుల గణన, జనాభా ఎక్స్‌రే నిర్వహణకు పార్టీ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ కుల ఆధారిత జనాభా గణను, రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని తొలగించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. విద్యాపరంగా వెనకబడిన వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, రాజ్‌ఠాకూర్, ఎంపీ మల్లు రవి, మాజీ ఎంపీ హనుమంత్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయికల్ శ్రీనివాస్ అప్పారెడ్డిగూడ మాజీ డిప్యూటీ సర్పంచ్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో మిగిలిన బియ్యం వేలం

**వికారాబాద్, జూలై25, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో గత కొంత కాలంగా సన్న బియ్యం ఉపయోగించకుండా మిగిలిన, నాణ్యత లోపించిన బియ్యం, వివిధ మండల కేంద్రాల్లో నిల్వ ఉంచిన బియ్యాన్ని వేలం పాట వేయనున్నట్లు పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మోహనకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 164.30 క్వింటాళ్ళ బియ్యం నిల్వ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం వేలం పాటలో పాల్గొ నుటకు రైస్ మిల్లర్ లకు, జిల్లా పౌర సరఫరాల సంస్థ అ నుబంధ కార్యక్రమాలు నిర్వహించేవారికి అవకాశము లేదని, ఇతరులు ఈ బియ్యము ు కొ నుగోలు చేయవచ్చని తెలిపారు. ఈ వేలంలో పాల్గొ నువారు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కలెక్టరేట్ పేరు మీద రూ.25 వేలు డీడీ తీసి పౌరసరఫరాల సంస్థ వికారాబాద్ జిల్లా కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని సూచించారు. 31వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు ఐడీఓసి కార్యాలయం నందు వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## పాంబండ ఆలయ హుండీ లెక్కింపు



**కుల్కచర్ల, జూలై 25, ప్రభాతవార్త** ః ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏకశిలా పర్వతం శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. శుక్రవారం కుల్కచర్ల మండల పరిధిలోని బండవెలికిచెర్ల పాంబండ ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన మొత్తం రూపాయలు లక్ష 46వేల 255 రూపాయలు గా లెక్కించామని ఆలయ చైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తుందని, దేవాలయ హుండి ఆదాయం కూడా పెరుగుతూ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రణీత్ కుమార్, ఈవో బాల నరసయ్య, సాంబశివ సేవా సమితి కార్యకర్తలు, ఆలయ కమిటీ ధర్మకర్తలు, అర్చకులు పాండు శర్మ ,దశరథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం

**షాద్‌నగర్, ప్రభాతవారజూలై25 :** ఫరూఖ్‌నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు భరత్ సింహ్మారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. పట్టణంలోని శ్రీ మలయాళ స్వామి వృద్ధాశ్రమంలో భరత్‌సింహ్మారెడ్డి జన్మదినం సందర్భంగా చౌలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నదాన కార్యక్రమంతో పాటు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్‌సింహ్మా రెడ్డి మాట్లాడుతూ తన జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు చేపడుతున్న తన మిత్ర బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరుల ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బూత్‌స్థాయి ఏజెంట్ల నియామకానికి శ్రద్ధ తీసుకోవాలి

-జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూలై 25, ప్రభాతవార్త** ః జిల్లాలో పోలింగ్ కేంద్రాలకు బూతుస్థాయిఏజెంట్ల నియామకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లాఅదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ రాజకీయ ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నుద్దేశించి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ, బూతుస్థాయి ఏజెంట్లప్రాధాన్యతఎంతో అవసరమని, ఏజెట్ల నియామకానికి ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకూడదనే నిబంధనల మేరకు ఎన్నిక కమిషన్ అ నుమతి మేరకు పోలింగ్ కేంద్రాల ు ఏర్పాటు చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. జిల్లాలో 118 పోలింగ్ కేంద్రాలలో 1200కుపైగాఓటర్లు ఉన్నట్లుగాగుర్తించినట్లుఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేమత్ అలీ, వివిధ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, సత్యనారాయణ, ఫెరోజ్, రాజేంద్ర గౌడ్, అనిల్ యాదవ్, మహిపాల్, సతీష్‌లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో బాత్‌రూములు లేక ఇబ్బందులు



### మన ఊరు -మన బడి కార్యక్రమంలో వాటిని నిర్మించినా బిల్లులు రాక తాళాలు వే సి వృధాగా పడి ఉన్న వైనం జిల్లా కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం, విద్యార్థులు అవసరాలకు తరచూ ఇళ్లకు వెళ్లిన వైనం

**శామీర్‌పేట, ప్రభాతవార్త, జూలై 25:** తూంకుంటలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో విద్యార్థుల కోసం బాత్‌రూమ్‌లను, మూత్రశాలలను నిర్మించినప్పటికీ వాటిని ఆచరణలోకి తీసుకరాకపోవటం, వాటికి తాళాలు వేసి వృధాగ ఉంచటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వెంటనే ఈ విషయంపై తగు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరికి జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి ఫిర్యాదువినిన్న వించారు.. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మూత్రశాలలు, బాత్‌రూమ్‌లు అంటూ లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మన ఊరు-మన బడి కార్యక్రమంలో.. వాటిని నిర్మించినప్పటికీ బిల్లులు రాలేదని సదరు కాంట్రాక్టర్ వాటికి తాళాలు వేసి ఉంచారని ఆయన ఫిర్యాదు చేశారు. పాఠశాలలో సుమారు 270మంది వరకు విద్యార్థులు ఉన్నారని వీరిలో 135మంది వరకు బాలికలు ఉన్నట్లు బాత్‌రూమ్‌లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వీటి కోసం పాఠశాల నుంచి ఇండ్లకు వెళ్లి రావటం జరుగుతుందని, దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు మాత్ర తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు వివరించారు. పాఠశాల విద్యార్థులు బాత్‌రూమ్స్, మూత్రశాలలు, మరుగుదొడ్లు అంటూ లేక పోవటంతో అనారోగ్యంకు గురికావాల్సి వస్తుందని వెంటనే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల ప్రధాన సమస్యను తీర్చాలని ఆయనను కోరారు. సదరు కాంట్రాక్టర్‌కు సుమారు 15 లక్షల రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉందని సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లవిద్యార్థులు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ను, జిల్లా కలెక్టర్‌ను జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి విన్నవించారు. వెంటనే విచారణ జరిపించి సంబంధితులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు. వెంటనే విచారణ జరిపించి సంబంధితులపై చర్యలు తీసుకుని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు.

## రైతులు నానో యూరియాను వినియోగించండి



**ఆమనగల్లు,జూలై25, ప్రభాతవార్త:** పంటసాగులో రైతులు యూరియా వాడకాన్నితగ్గించిదానికిబదులుగా నానో యూరియాను వినియోగించుకుని లబ్దిపొందాలని ఆమనగల్లు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకురాలు శోభారాణి అన్నారు. పంటపొలాలకు నానో యూరియా వినియోగంతో రైతుకు ఆర్థికభారం తగ్గుతుందని తెలిపారు. యూరియా కొరకు అంధోళన చెందవలసిన అవసరం ఎంతమాత్రం లేదని, అవసరమైన యూరియాఅందుబాటులోఉందనిఆమెవివరించారు.నానో యూరియా వినియోగంపట్లరైతులకుఅవగాహన కల్పించేందుకు శుక్రవారం ఆమె స్థానికవ్యవసాయాధికారులతో కలిసిగ్రామాలలో పర్యటించారు. పలువురు రైతులనువారిపంటపొలాలవద్ద కలుసుకుని సాగులో అవలంభిస్తున్న విధానాలనుఅడిగి తెలుసుకున్నారు. అలాగే పంటసాగులో మెళుకువలను వివరించడమే కాకుండా నానోయూరియా పట్ల అవగాహన కల్పించారు. ఈమేరకు ఏడిఏ శోభారాణి మాట్లాడుతూ ఆమనగల్లు డివిజన్ పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలో 80వేల ఎకారాలలోరైతులుసాగు చేస్తున్నట్లు ఆమె వివరించారు. వరి,పత్తి,ఎ మొక్కజొన్న,జొన్నసాగువిరివిగాచేపడుతున్నట్లుచెప్పారు. వర్షాలువిస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో రైతులుపంట పొలాలకుఎరువులువాడకంపట్ల అవగాహన పెంపొందిస్తు న్నట్లు అధికారి వివరించారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. ఏఓలు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి ఉన్నారు.

## యాదగిరి కీసరగుట్టకు మెట్రో సౌకర్యం కల్పించండి



**ఘట్‌కేసర్,జూలై25,ప్రభాతవార్త:**తెలంగాణఆధ్యాత్మికంగా తలమానికలైన యాదగిరిగుట్ట, కీసరగుట్ట పుణ్యక్షేత్రాలకు మెట్రోరైలు సౌకర్యం కల్పించాలని బిజెపిరాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి శుక్రవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఢిల్లీలోని పార్లమెంట్‌భవన్‌లోకలిసివినతిపత్రంఅందజేశారు.హైదరాబాద్ నగరానికి సమీపంలోఉన్నయాదగిరిగుట్టశ్రీలక్ష్మినరసింహ్మాస్వామి, కీసరగుట్ట శ్రీరామ లింగేశ్వరస్వామిక్షేత్రాలకుభక్తులరద్దీపెరుగుతుందని ఆర్టీసీ బస్సులల ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారనిరెండు పుణ్యక్షేత్రాలకు కూడామెట్రో రైలుసేవలు అందించేందుకు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రితో మాట్లాడి మెట్రో మంజూరు చేయించేందుకు కృషి చేయాలని ఎంపీకివిజ్ఞప్తి చేశారు. ఎంపీని కలిసిన వారిలో సుదర్శన్‌రెడ్డితోపాటుబిజెపి నాయకులు గొంగళ్ల బాలేశ్, రమేశ్‌నాయుడులు ఉన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలకు పోలీసుల అనుమతి

**ఘట్‌కేసర్,జూలై25,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు పోలీసులు అనుమతి ఇచ్చారని త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి-ఇందూజ్ఞానవేదిక సభ్యులు తెలిపారు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ పరుశురాంను కలిసి శ్రీకృష్ణాష్టమి వేడుకలకు అనుమతి కోసం ధరఖాస్తు చేయగా వివరాలు తెలుసుకున్న సీఐ అనుమతి జారీ చేశారని వారు తెలిపారు. త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితి-ఇందూ జ్ఞాన వేదిక ఘట్‌కేసర్-భువనగిరి కమిటీ ఆధ్వర్యంలో ఆగష్టు 16 నుంచి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని 22న శ్రీకృష్ణ భగవాన్ ఊరేగింపు బందోబస్తు కొసం నిర్ణిత చలానా చెల్లించడం జరిగిందని తెలిపారు. త్రైత సిద్ధాంతం ప్రబోధసమితి-ఇందూ జ్ఞాన వేదిక ఘట్‌కేసర్-భువనగిరి కమిటీ అధ్యక్షులు దేవేంద్ర, భాస్కర్, రామకృష్ణలు పాల్గొన్నారు.

## ఘనంగా గోదారంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు



**ఘట్‌కేసర్,జూలై25,ప్రభాతవార్త:**ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీగోదాసమేతమన్నార్‌రంగనాయకస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గరుడాద్రిక్షేత్రంగా పిలువ బడుతున్న ఈ ప్రాచీన ఆలయంలో శ్రావణ అమవాస్య రోజు నుంచి సప్తమి వరకు 8 రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్యఆలయంలోవిష్వక్సే నారాధానపుణ్యాహవాచనం, ఋత్విక్‌వరణము, కౌతుక బంధనము, మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శుక్రవారం ధ్వజారోహణం, బేరిపూజ దేవతాహ్వానము నిర్వహించారు. శనివారం స్వామికి శేషవాహన, హనుమంత వాహనసేవ జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తిరువడందం పొరెత్తి వంశపారంపర్య ధర్మకర్తలు కోరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని కొబ్బరి, మామిడి, అరటి తోరణాలు, విద్యుత్ లైట్లతో దేదీప్యమానంగా అలంకరించారు.

## రైలు కింద పడి బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

**ఘట్‌కేసర్, జూలై 25, ప్రభాతవార్త:**
రైలు కింద పడి ఓ బిటెక్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోచారం మున్సిపల్ యంనంపేట్ సమీపంలోని వంతెన వద్దరైలు ట్రాక్‌పై ఓవ్యక్తి మృతదేహం పడి ఉందని సికింద్రాబాద్ జిఆర్‌పీ పోలీసులకు సమాచారం రావడంతో వారు చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం మానాయిగూడెంకు చెందిన ఉప్పుల రాజేందర్‌గా గుర్తించారు. మృతుడు ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఉంటూ యంనంపేట్‌లోని శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ఈసీఈ మూడవ సంవత్సరం చదివాడు. గురువారం బిటెక్ 4వ సంవత్సరం తరగతులు ప్రారంభమవుతున్న క్రమంలో ఉదయం 7":45 సమయంలో రైలు పట్టాలపైకి వెళ్లి గుర్తుతెలియని రైలుకు ఢీకొని తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు జిఆర్‌పి పోలీసులు శవాన్ని గాంధీ ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ చేయించి కుటుంబసభ్యులకు అప్పగించి బిఎన్ఎస్ ఆర్‌పిఎస్ 194 సెక్షన్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

# ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి విక్రయిస్తు పోలీసులకు పట్టుబడిన ఇద్దరు నిందితులతో ఘట్‌కేసర్ ఎక్సైజ్ సిఐ జూపల్లి రవి, ఎస్సైలు

### 6కిలోల ఎండు గంజాయి, 2 సెల్‌ఫోన్ల స్వాధీనం

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 25, ప్రభాత వార్త:** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుండి ఆరు కిలోల 65 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించిన సంఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐ జూపల్లి రవి తెలిపిన కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తన సిబ్బందితో కలిసి దమ్మాయిగూడలో ఓ ఇంటిపై దాడి జరుపగా మహ్మద్ నవాజ్‌ఖాన్ (34 ) అనే వ్యక్తి వంట గదిలో నల్ల రంగు కాటన్‌కవర్‌లో ఎండు గంజాయి ప్యాకెట్లు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఎండు గంజాయి లభ్యం కావడంతో ఎండీ. నవాజ్‌ఖాన్‌ను పోలీసులు ప్రశ్నించగా తాను తన స్నేహితుడు మహబూబ్ ఆలం ( 20 ) నుండి కిలో ఎండు గంజాయిని కోనుగోలు చేసినట్లు తెలిపారు. ఎండు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా మార్పిడి చేసి 500 రూపాయలకు ఒక్కటి చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఇరువురు నిందితులను పోలీసులు ప్రశ్నించగా వీరి వద్ద నుండి మొత్తం ఆరు కిలోల 650 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. షేక్ మహబూబ్ ఆలం అనే వ్యక్తి కాంపెల్లి తిరుపతి ( 27 ) అడ్డగుట్ట సికింద్రాబాద్ వాసి నుండి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరు ముగ్గురు గతంలో పాత కేసుల్లో చర్లపల్లి జైలులో ఉండగా పరిచయమై గంజాయి క్రయవిక్రయాలు ఎలా నిర్వహించాలో ముగ్గురు వేసిన పథకం ప్రకారం గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తిరుపతి అనే వ్యక్తి ఏపిలోని అన్నవరం నుండి గంజాయి కొనుగోలు చేసి పదిహేను వేల రూపాయలకు కిలో చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసులకు పట్టుబడిన నిందితులు ఎండీ. నవాజ్‌ఖాన్, షేక్ మహబూబ్ ఆలం నిందితులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించగా మరో నిందితుడు తిరుపతి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన నిందితుల నుండి ఆరు కిలోల 65 గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులను అరెస్టు చేసిన వారిలో సీఐ జూపల్లి రవి, ఎస్సైలు నందిని, ఎం. సంగీత పోలీస్ సిబ్బంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

## అమ్మవార్ల తృతీయ వార్షికోత్సవ వేడుకలు



పూజల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు

**ఘట్‌కేసర్‌రూరల్,జూలై25,ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలోని నల్లపోచమ్మ, ఎర్ర పోచమ్మ, మహంకాళి, ఈదమ్మ ఆలయాల్లో శుక్రవారంతృతీయ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ గ్రామ దేవతలు గ్రామ రక్షణగా గ్రామస్తులచేత పూజలు అందుకుంటారని అన్నారు. పూర్వ కాలం నుండే గ్రామాల్లో దేవతమూర్తులను కలిచేసంప్రదాయం కొనసాగుతుందని అన్నారు. తృతీయ వార్షికోత్సవ పూజ వేడుకల్లో భాగంగా అమ్మవార్లకు గణపతి పూజ,పుణ్యాహవాచనం, దీపారాధన, ఉత్సవ మూర్తులకు అభిషేకం, గణపతి హవనం, మూల మంత్రహవనం, మహాపూర్ణాహుతి ఆశీర్వచనంవంటిపూజలుచేశారు.అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కేఎం. రెడ్డి, వైస్ చైర్మన్ పొలగొని వెంకటస్వామి గౌడ్, డైరక్టర్లు అల్వాల్ దర్శన్ గౌడ్, రాధారం యాదగిరి, దర్నబోయిన శ్రీనివాస్ ముదిరాజ్, జితేందర్‌నాయక్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, కొంతం శంకర్‌రెడ్డి, బోయపల్లి సత్తిరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, విఠల్ రెడ్డి, బాలగొని చిన్నశంకర్ గౌడ్, బీజేపీ నాయకులు బిక్కునాయక్, బి. రాజేశ్వర్‌రెడ్డి, బోదాసు వెంకటేశ్, రాధారపు శ్రీశైలం, రాధారపు పెంటయ్య, గోపు మారెడ్డి, పసులాది మల్లేశ్,వేదపండితులు కార్తీక్, యుగంధర్ గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిది



**తలకొండపల్లి జూలై 25, ప్రభాతవార్త:**రాష్ట్రంలోని పేద ప్రజలకు సీఎం రిలీఫ్‌పండు పథకం వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవంచ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం నాడు తలకొండపల్లి గ్రామానికి చెందిన గొడుగు శిల్ప అనే మహిళ కు మంజూరైన 60 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారూ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ప్రజలు వైద్య సౌకర్యం కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తుండడం తో ఎంతోమందికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ కింద ప్రభుత్వపరంగా ఆదుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఏ లాంటి సమస్య ఉన్న ఎమ్మెల్యే సహకారంతో సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కులు పేద ప్రజలకు అందుతున్నాయని సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో అజీమ్ రవీందర్ యాదవ్, కృష్ణ నరసింహ మూల యాదగిరి మల్లేష్ పోతుగంటి గణేష్ వెంకటేష్ మల్లేష్ పురుషోత్తం పోతుగంటి సురేష్ శీను తదితరులుపాల్గొన్నారు.

## అనుమతులు లేని దవాఖానాలు సీజ్



చౌదరిగూడలో ధవాఖనాను సీజ్ చేస్తున్న వైద్య సిబ్బంది

**జిల్లేడు చౌదరిగూడెం, జూలై,25, ప్రభాతవార్త:** జిల్లెడుచౌదరి గూడ మండల కేంద్రంలోని ధవాఖానాలపై శుక్రవారం వైద్య సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బివెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు షాద్నగర్ డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని లక్ష్మి ప్రసన్న క్లినిక్,రమ్య క్లినిక్‌లలో తనిఖీలుచేశారు.క్లినిక్‌లు ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న విషయం పరిశీలించి క్లినిక్లను సీజ్ చేసినట్లు తెలిపారు. క్లినిక్ లోని యజమానులకు వారి యొక్క క్వాలిఫికేషన్ సర్టిఫికెట్ల సహాయముతో, క్లినిక్ ల యొక్క పర్మిషన్ కోసము రంగారెడ్డి జిల్లా డిఎం అండ్ హెచ్ ఆఫీసులో అప్లై చేసి పర్మిషన్ తీసుకుని క్లినిక్లను ఓపెన్ చేసుకోవాలని సూచించారు. మరొకరు చంద్రకాంత్ అనే అబ్బాయి ఎలాంటి బోర్డు లేకుండా చికిత్స నిర్వహించడం గుర్తించి అతని ధవాఖానాను బంద్ చియినంచినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండ ధవాఖానాలు నడిపిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కొందుర్గు పి.హెచ్.సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమృత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, పి హెచ్ఎన్ లు, ఎం పి హెచ్ఈఓలు మున్వర్, శ్రీనివాసులు, మేల్ హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, అశ్వక్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి నేతల పరామర్శలు



**తలకొండపల్లిజూలై25,ప్రభాతవార్త:**తలకొండపల్లిమండల పరిధిలోని వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలో గల ఇస్రాయి పల్లి గ్రామానికి చెందిన పెంటయ్య అనే వ్యక్తి ఇటీవల చెందడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ లు శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పెంటయ్య మృతి చెందడం వారి కుటుంబానికి తీరని లోటని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తపరిచారు. అనంతరం వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీలు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్, మాజీ జెడ్పిటిసి పద్మ నరసింహ, తల కొండపల్లి సర్పంచ్ పెరుమాల లలిత జోతయ్య , సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, నాయకులు జంగయ్య కిషోర్ శంకరయ్య వెంకటయ్య కుమార్ నాయకులు జంగయ్య కిషోర్ శంకరయ్య వెంకటయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారుపాల్గొన్నారు.కాంగ్రెస్పార్టీ అద్వర్యాములోక ాంగ్రెస్పార్టీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకరరెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు 3000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీశైలం,సాయికిరణ్,వెంకటేష్,బాలస్వామి, ఎపాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

### బిజెపి నేత తల్లోజు ఆచారి



ఆమనగల్లు,జూలై25,ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికలకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా సంసిద్ధంగా ఉండాలని జాతీయ ఓబిసి కమీషన్ మాజీ సభ్యుడు, బిజెపి రాష్ట్ర నాయకులు తల్లోజు ఆచారి అన్నారు. ఎన్నికలలో గెలుపే లక్ష్యంతో ప్రణాళికలు రచించుకుని ప్రజలకు మరింత చేరువకావాలని ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతునే కేంద్ర ప్రభుత్వం దేశాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించి దగ్గర కావాలని తెలిపారు. ఆమనగల్లు మండల కేంద్రంలో బిజెపి రూరల్ మండల అధ్యక్షుడు కెకెశ్రీను, మున్సిపాలిటి పట్టణ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డిల అధ్యక్షతన శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశంలో ఆచారి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈసందర్భంగా ఆచారి మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దశదిశ నిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవలంభించవలసిన అంశాలను ఆయన సవివరంగా వివరించారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ పంచాయతీలతోపాటు, మున్సిపాలిటి, జడ్పీటీసీ, ఎంపిటిసి,ఎంపిపి, జడ్పీ చైర్మన్ స్థానాలను కైవసం చేసుకోవాలని వివరించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటే విజయం సులువుగా దక్కుతుందన్నారు. స్థానిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ వైఫల్యాలు, అర్హులకు అందని ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో పేదలకు జరుగుతున్న నష్టాలను పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించాలని సూచించారు. బూత్ స్థాయి లీడర్లు తమ బాధ్యతలను గుర్తెరిగి నడుచుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రధానమోడి ఛరిస్మాను వినియోగించుకుంటూ ప్రజలతో మమేకం కావాలని ఆచారి తెలిపారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు, మాజీ జడ్పీటీసి కండె హరిప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ గోరటి నర్సింహ్మా, జిల్లా కౌన్సిల్ మెంబర్ చెక్కాల లక్ష్మణ్, నేనవత్ రవి, పద్మ ప్రశాంత్, శ్రీశైలంయాదవ్, దుద్దు కృష్ణయాదవ్, చెన్నకేశవులు, విష్ణుచారి,అంబర్‌సింగ్, సింగంపల్లి శ్రీను, సింగంశ్రీను, భగవాన్‌రెడ్డి, జంతుక జానయ్య, లండం చంద్రయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్‌రావు, పాలాది శ్రీను, మొక్తాల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థలలో సత్తాచాటాలి



:సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు ఎదిర రాజు25 ఘట్‌కేసర్ రూరల్ 2

**జిల్లేడుచౌదరిగూడెం, జూలై,25, ప్రభాతవార్త:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి బలపరిచిన అభ్యర్థులను గెలిపించి తమ సత్తా చాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ భవనంలో మండల అధ్యక్షుడు ఎదిర రాజు ఆధ్వర్యంలో మండల వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ గ్రామాల్లో బిజెపి నాయకులు ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రజలకు పథకాలను వివరిస్తే తప్పనిసరిగా ఓట్లు తమ పార్టీకి వేస్తారని అన్నారు. గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు ఎన్నికలలో పోటీకి సిద్దంగా ఉండాలని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి చేనేత విభాగం రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి, కార్యవర్గ సభ్యుడు కోనేరు శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు బోయ కుర్మయ్య, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పార్కు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన కాంగ్రెస్ నాయకులు



**ఘట్‌కేసర్ రూరల్,జూలై 25, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ చౌదరిగూడలో దాదాపు కోటీ పది లక్షల రూపాయలతో రెండు వేల గజాల స్థలాన్ని హెచ్ఎండీఏ వారు అభివృద్ధి చేసే పనులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడ విజయపురి కాలనీలో గల పార్కు స్థలాన్ని హెచ్ఎండీఏ వారు కోటీ పది లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టింది. హెచ్ఎండీఏ చేపట్టిన అభివృద్ధి పనులను టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ పాలడుగు అమరేందర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బండ్లగూడెం నగేశ్ గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పల్లె బాబురావు గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు భానోత్ శ్రవణ్ నాయక్‌లు పరిశీలించారు. ప్రజలకు అవసరమైన పార్కును అభివృద్ధి చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## రామేశ్వర్ కుటుంబానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ పరామర్శ



**మర్పల్లి జూలై25 ప్రభాతవార్త :** మర్పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్ తల్లి అనారోగ్యంతో గత5 రోజుల క్రితం మృతి చెందగా ఈవిషయం తెలుసుకున్న స్పీకర్ గడం ప్రసాద్‌కుమార్ శుక్రవారం నాడు మర్పల్లికి చేరుకొని సమాధిపై పూలు వేసి నివాళులు అరుపించారు.కుటుంబాన్నిపరామర్శించారు.ఆయన వెంట జిల్లామాజి గ్రంథలయ చైర్మెన్ కొండల్‌రెడ్డి,నాయకులు రాములుయాదవ్,
పలువురు స్థానికనాయకులుపాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



**తలకొండపల్లి జూలై25,ప్రభాతవార్త:** తలకొండపల్లి ప్రభుత్వ కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల స్ట్రెంతు ను పెంచి, బలోపేతం చేయాలనే ముఖ్య ఉద్దేశంతోనే అని వాలీబాల్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని దేవుని పడకల్ గ్రామానికి చెందిన వాలీబాల్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ తెలుసుకున్న తక్షణమే స్పందించి వాలీబాల్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ తన వంతుగా రూ,15000వేల రూపాయలతో సొంత నిధులతో ప్రభుత్వ కళాశాలకు కావలసిన గ్రీన్ బోర్డులు 2, కుర్చీలు 10 ప్రభుత్వ కళాశాలకు అందజేయడం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వాలీబాల్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ ను ఘనంగా శాలువలతో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వాలీబాల్ గ్రామ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల రూపురేఖలు మారాయని, ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చక్కటి భవనాలు, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని అన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుకోవడమే మీ అదృష్టం అని విద్యార్థులకు తెలిపారు. ఇతర వస్తువులు అందిస్తున్న ఘనత మన ప్రభుత్వ కళాశాలకు దక్కిందన్నారు. ప్రభుత్వం కళాశాలలో చక్కటి వసతులు కల్పించడంతోపాటు సుశిక్షి తులైన అధ్యాపకులచే బోధన చేపట్టడం మూలంగా కార్పొరేట్‌కు ధీటైన ఫలితాలు వస్తున్నాయని ఆశ బావ వ్యక్తం చేయడం జరిగింది. ఉపాధ్యాయులు చెప్పిన సబ్జెక్టులు గాని బోధిస్తున్నప్పుడు విద్యార్థులు చక్కగా చెప్పింది విని మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు తెలిపారు.ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన చదువుతోపాటు ఉచిత పాఠ్య పుస్తకాలు, విశాలమైన తరగతి గదులు, ఆట స్థలం ఉన్నాయి. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వకళాశాలలో చేర్పించిపాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు.విద్యార్థులుప్రతివిషయాన్నిప్రణాళికయుతంగాఆలోచించి ఆచరించాలన్నారు. ఏకాగ్రతతో చదివితే మరింత ముందుకు వెళ్లగలరని విద్యార్థులకు సూచించారు. కళాశాలకు మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విద్యార్థులకు సామాగ్రిలు కావాలని తెలుపడంతో వెంటనే తక్షణమే స్పందించినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ కాలే శేఖర్, అడ్మిషన్ డ్రైవ్ ఇంచార్జ్ లైబ్రేరియన్ జి. షణ్ముఖరెడ్డి, కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, కృష్ణ కాంత్, యాదయ్య,విజయ్ కుమార్, సంతోష్ కుమార్, వెంకన్న, పరమేష్, శ్రీనివాస్, గార్గేయ, పద్మ, శ్రీ సాయి రణిషా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు షాబాద్ లో బిజెపి కార్యకర్తల సమావేశం

**షాబాద్, జులై 25, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలపై రూపకల్పన చేసేందుకు శనివారం షాబాద్ లో బిజెపి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మద్దూరు మానయ్య తెలిపారు. శనివారం 11 గంటలకు మండల కేంద్రంలోని ఎమ్మెస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజుభూపాల్ గౌడ్ హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.